క్లుప్తంగా

ఘనంగా అంకమ్మతల్లి సంబరాలు

పమిడిముక్కల: మండలంలోని ఐనపూరు గ్రామంలో అంకమ్మతల్లి సంబరాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి



గుడ్లవల్లేరు: మండే ఎండల్లో సైతం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి అత్యధిక మంది భక్తులతో ఆదివారం సందడిగా మారింది. భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామివారి మూర్తులను ప్రతిష్టించేందుకు అర్చకులతో పూజలు చేయించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు సహాయ కమిషనర్ తెలిపారు.

27న జగన్నాథుడి రథయాత్ర



ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి రథయాత్ర ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. రథయాత్ర ఉదయం 8 గంటలకు స్వామివారి ఆలయ సన్నిధి నుంచి వడాలి గ్రామం మీదుగా ముదినేపల్లి ప్రధాన సెంటర్ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అక్కడి నుంచి సింగరాయపాలెం బావాజీ మఠం వరకు కేరళ నృత్యాలు, మేళతాళాలతో ఊరేగించనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి తిరిగి వడాలి స్వామి సన్నిధికి చేరుస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉపాధ్యాయుడు బెనర్జీకి సన్మానం



కైకలూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ద్విశత కవి సమ్మేళనం కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగింది. కైకలూరు మండలం గోపవరం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, సహజకవి దండే బెనర్జీ పాల్గొన్నారు. నాన్న ప్రేమతో అనుశీర్షికగా కవితను చెప్పి అందరి మన్ననలు పొందారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, జాతీయ అధ్యక్షురాలు చిట్టే లలిత, కాకినాడ కార్య నిర్వాహక సభ్యులు జ్ఞాపికను అందించారు. అనంతరం బెనర్జీని కైకలూరు సాహితీవేత్తలు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన గ్రామ దేవతల సంబరాలు

పెడన: మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో గ్రామ దేవతల సంబరాల మహోత్సవాలు అంగరంగవైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో గత 11 రోజులు నిర్వహించగా చివరి రోజు ఆదివారం 12వ రోజుతో ముగిశాయి. గ్రామంలో వెలసిన మహంకాళమ్మ తల్లి, గంగానమ్మతల్లి, అంకమ్మ తల్లి, పోతురాజు, నాగేంద్రస్వామి సంబరాల మహోత్సవాలను ఈ నెల 11వ తేదీ నుంచి ఆదివారం వరకు నిర్వహించారు. ఆఖరి రోజు కావడంతో గ్రామంలోని గ్రామదేవతల ఆలయం ముందు భారీగా భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. సంబల వారు అంకగుడారం వేసి పోటు గొర్రెపొడిచి గ్రామ దేవతలకు వేడి నైవేద్యాలను సమర్పించారు. రాత్రికి కొర్లబండి ఊరేగింపుతో ఊరి పొలిమేరకు సాగనంపారు. జిల్లా, రాష్ట్ర నలుమూలల నుంచి కూడా భక్తులు వచ్చి ఆయా అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్, పెడన ఎస్ఐ జి.సత్యనారాయణ, ఎస్ఐ సత్యనారాయణ, కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.



ముదినేపల్లి మండలం చినకామనపూడి-లింగాల రహదారి దుస్థితి



కైకలూరు మండలం దొడ్డిపట్ల రహదారిలో పడిన గుంతలు

రహదారులు అస్తవ్యస్తం

- ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కైకలూరు: నియోజకవర్గంలో రహదారులు నరకకూపంగా మారుతున్నాయి. చిన్నపాటి చినుకులు పడితే బురదమయంగా మారుతున్నాయి. గుంతలు గుర్తించక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో కైకలూరు రోడ్లు అధ్వానంగా మారాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షాలకు రహదారులను ముంచేస్తున్నాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్య చెబుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.



కలిదిండి మండలం కాళ్లపాలెంలో బురదమయంగా మారిన రోడ్డు

గుంతల మయం

నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు గుంతల మయంగా మారాయి. అనేక ప్రాంతాల్లో భారీ గుంతలతో దర్శనమిస్తున్నాయి. కలిదిండి మండలంలో మట్టగుంట - పెదలంక, మూలలంక - పెదలంక, మండవల్లి మండలంలో పెనుమాకలంక- పెదలంక, దెయ్యంపాడు - తక్కెళ్లపాడు, ముదినేపల్లి మండలంలో కోడూరు రోడ్డు, ముదినేపల్లి - గుడ్లవల్లేరు రోడ్లు దెబ్బతిన్నాయి. కై కలూరు మండలంలో దొడ్డిపట్ల రహదారి గుంతల మయంగా మారింది. కొల్లేరులంక గ్రామాల్లో రహదారులు పాడయ్యాయి.

భారీ టిప్పర్లతో రహదారులు ధ్వంసం

నియోజకవర్గంలో నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయి. దీంతో వేలాది టిప్పర్లు అధిక లోడులతో తిరగడం, అదేవిధంగా ప్రతి రోజూ ఆక్వా చెరువులకు మేతల లారీలు, ఐస్ ఫ్యాక్టరీల నుంచి చేపల ఎగుమతుల లారీలు అధిక లోడుతో ప్రయాణించడంతో రహదారులు దెబ్బతింటున్నాయి. టిప్పర్ల కారణంగా తమ గ్రామాల రహదారులు దెబ్బతింటున్నాయని నిరసనలు సైతం పలు ప్రాంతాల్లో జరిగాయి. రహదారుల సమీపంలో చెరువులు ఉండటంతో నీటి ఊట కారణంగా రోడ్లు పాడవుతున్నాయి.

డ్రెయినేజీ వ్యవస్థ కూడా..

గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో వర్షాలు కురిసినప్పుడు నీరు రహదారులను ముంచెత్తుతోంది. కైకలూరులో రహదారులపై డ్రెయిన్లను అనేక మంది ఆక్రమించారు. రోజువారీ చెత్త పడవేయడంతో డ్రెయిన్లు పూడుకుపోయాయి. భారీ వర్షాల సమయంలో రోజుల తరబడి రహదారులపై నీరు నిల్వ ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికలోడు వాహనాలను అనుమతించొద్దు



గ్రామీణ ప్రాంతాలకు అధిక లోడుతో భారీ వాహనాలు తిరుగున్నాయి. దీని వల్ల రహదారులు ధ్వంసమవుతున్నాయి. అధికారులు వీటిని నియంత్రించాలి. గ్రామాల్లో మట్టి ట్రాక్టర్లు వెళుతున్నప్పుడు మట్టి రోడ్డుపై పడుతోంది. వర్షాలు వస్తే అనేక మంది వాహనదారులు జారి పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బండి శ్రీనివాసరావు, ఆలపాడు, కైకలూరు మండలం

గుంతలమయంగా రోడ్లు



గుంతల మయంగా మారుతున్న రోడ్లపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కైకలూరు టౌన్‌హాలు సమీపంలో జాతీయ రహదారిపై చిన్నపాటి వర్షం వచ్చినా భారీగా నీరు చేరుతోంది. ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి. అధికారులు తక్షణం రోడ్లుకు మరమ్మతులు చేయాలి.

– లావేటి వీరశివాజీ, లోకుమూడి, మండవల్లి మండలం

బతుకు పోరాటం



కత్తులు విక్రయిస్తున్న మహిళ

తోట్లవల్లూరులో కత్తుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన పలువురు కార్మికులు కుటుంబ సమేతంగా తరలివచ్చి కత్తులు, గొడ్డళ్లు, చాకులు తదతర గృహోపకరణ వస్తువులు తయారు చేస్తూ సంచార జీవనం సాగిస్తున్నారు. రాష్ట్రాల సరిహద్దులు దాటొచ్చి బతుకు పోరు సాగిస్తున్న వీరి జీవనశైలి పలువురిని ఆకట్టుకుంటోంది.

–తోట్లవల్లూరు



కత్తుల తయారీలో కార్మికుడు

కోలాటంలో శిక్షణ



మండవల్లి: స్థానిక వెలమ పేట రామాలయం వద్ద గురువు పరసా వీరాస్వామి పర్యవేక్షణలో నల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వెలమపేటకు చెందిన బాల బాలికలు రెండు నెలలుగా కోలాటం నేర్చుకుంటున్నారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు నిత్యం ప్రదర్శన ఇస్తున్నారు. ఇది సందర్శకులకు కనువిందు చేస్తుంది. గతంలో ఇక్కడ పెద్దలు కోలాట ప్రదర్శనలు నిర్వహించేవారు. అదే ఆనవాయితీలో పిల్లలు కూడా ఈ ప్రదర్శన పట్ల ఆకర్షితులౌతున్నారు.

30న మండల సమావేశం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కేఏఎస్ రవికాంత్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు కొబ్బరి చెక్కల వేలం

రామవరప్పాడు: స్థానిక పేరంటాలమ్మ ఆలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు కొబ్బరి చెక్కలు పోగుచేసుకునే లైసెన్స్ హక్కునకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రియాంక తెలిపారు. భక్తులు ఆలయంలో సమర్పించే కొబ్బరి చెక్కలను రెండేళ్ల కాలపరిమితికి పోగు చేసుకునేందుకు ఈ వేలం నిర్వహిస్తున్నామన్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారి పర్యవేక్షణలో జరిగే ఈ వేలంలో ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు. అలాగే ఆలయంలో హుండీ కానుకలు లెక్కింపు చేపడతామని తెలిపారు. భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని లెక్కిస్తామన్నారు.

'యువత పోరు'ను జయప్రదం చేయండి

పమిడిముక్కల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జరిగే యువత పోరును జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ కోరారు. మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం నిర్వహించే యువత పోరులో యువతీ యువకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ యువజన విభాగ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు గుదే రవి కోరారు. గుడ్లవల్లేరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిరుద్యోగ భృతిని విస్మరించిందన్నారు. దానిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద సోమవారం జరగనున్న యువత పోరు ధర్నాలో గుడ్లవల్లేరు మండలానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు

సీపీఎం ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

కలిదిండి (కైకలూరు): విద్యుత్ స్మార్ట్ మీటర్ల అమర్చే విధానాన్ని రద్దు చేయాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భాస్కరరావు పేటలో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా ప్రచార పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.16 వేల కోట్ల అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచుతున్నామని చెప్పకుండా దొడ్డిదారిన ట్రూ అప్ చార్జీల భారం వేసిందని విమర్శించారు. విద్యుత్ చార్జీలు ఎందుకు పెంచారంటే గత ప్రభుత్వం పెంచిందని, తమ తప్పు లేదని కూటమి నేతలు చెప్పడం తగదన్నారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని గతంలో లోకేష్ చెప్పారని, నేడు మంత్రి అయ్యాక వాటిని అమర్చాలని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పెంచిన విద్యుత్ చార్జీలతో పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలను, అదానీతో విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కలిదిండి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి శేషపు మహంకాళి రావు, కమిటీ సభ్యులు వి.భాస్కరరావు. జే మహేష్. డీవీ సత్యనారాయణ, బి.రామనాగేంద్రరావు, వి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ స్మార్ట్ మీటర్ల రద్దు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఎంపీపీ కృషితో వంతెన నిర్మాణం

ముదినేపల్లి రూరల్: ఎంపీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రామిశెట్టి సత్యనారాయణ కృషితో చిగురుకోట వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలో చిగురుకోట-బొమ్మినంపాడు గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు పెదకొమ్మిలేరు మేజర్ డ్రెయిన్ అడ్డంకిగా మారింది. దీంతో ఒక గ్రామం నుంచి మరొక గ్రామంలోకి చేరుకోవాలంటే కలిదిండి మండలం కోరుకొల్లు మీదుగా 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ రూటు కాకుండా సింగరాయపాలెం మీదుగా బొమ్మినంపాడు వెళ్లాలంటే 15 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఈ రెండు గ్రామాలతో పాటు ములకలపల్లి, అల్లూరు, కొరగుంటపాలెం, ముదినేపల్లి గ్రామాల ప్రజలకు పెదకొమ్మిలేరు డ్రెయిన్‌పై చిగురుకోట వద్ద వంతెన నిర్మాణం చేపడితే ఎంతో ప్రయోజనం ఉంటుంది. కేవలం ఒక కిలోమీటరు దూరంతోనే ఈ గ్రామంలో ప్రజలు రాకపోకలు సాగించవచ్చు. అదేవిధంగా ఈ గ్రామాల ప్రజలు మండవల్లి మండల కేంద్రానికి చేరుకునేందుకు అతి దగ్గర దారిగా ఉంటుంది. చిగురుకోట నుంచి అయ్యవారి రుద్రవారం మీదుగా మండవల్లి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంతోనే వెళ్లవచ్చు. ఇంతటి సౌలభ్యం ఉన్న ఈ రూటుకు సంబంధించి పెదకొమ్మిలేరుపై వంతెన లేకపోవడంతో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. దీని ప్రాధాన్యతను గుర్తించిన ఎంపీపీ వంతెన నిర్మాణం చేపట్టేందుకు నడుం బిగించారు.



వంతెన పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ

రెండేళ్ల కిందట రూ.10 లక్షలు మండల పరిషత్ నిధులు వంతెన నిర్మాణానికి కేటాయించారు. ఇవి చాలకపోవడంతో ఎంపీపీ సోదరుడు రామిశెట్టి ప్రసాద్ మరో రూ.6 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ నిధులతో వంతెన నిర్మాణం పూర్తిచేశారు. వంతెన పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. దీంతో కొద్దిరోజుల్లో ఈ వంతెనపై మండలంలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ సందర్భంగా ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని ప్రజల ఇబ్బందులను గుర్తించి వీ వంతెన నిర్మాణానికి పూనుకున్నట్లు చెప్పారు. నిధులు చాలకపోవడంతో తన సోదరుడు ముందుకువచ్చి విరాళం ఇవ్వడంతో పనులు పూర్తిచేయగలిగినట్లు చెప్పారు. ఇందుకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా వంతెన



పెనుమత్సలో ప్రమాదకరంగా ఉన్న వంతెన

పెనుమత్స మహాయోగిని ఆలయం ఎదుట పంటకాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. వంతెన గోడలు పగుళ్లిచ్చి, ఇనుప చువ్వలు కనబడుతున్నాయి. రైతులు పొలాలకు వెళ్లాలన్నా, పండిన పంటను తీసుకురావాలన్నా ఈ వంతెన ఎంతో అవసరం. వంతెన నుంచి పొలాలకు వెళ్లే డొంక రోడ్డు కూడా కోతకు గురైంది. వంతెనను తొలగించి కొత్తది నిర్మించాలని, డొంకరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

– పమిడిముక్కల

రైతులకు అందించిన సేవలు నిరుపమానం

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండల వ్యవసాయాధికారిగా కంచర్ల శివప్రసాద్ ఎనిమిది సంవత్సరాలుగా రైతులకు అందించిన సూచనలు వెలకట్టలేనివని అతిథులు పేర్కొన్నారు. మొవ్వ మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించి గన్నవరానికి బదిలీ అయిన శివప్రసాద్‌కు ఆదివారం ఆ శాఖ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండల పెడసనగల్లు రోడ్డులోని కూచిపూడి పెదపూడి వర్తకసంఘ కల్యాణమండపంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేసి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, బార్లపూడి నీటి సంఘం అధ్యక్షుడు తాతినేని పూర్ణ చంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, సూరపనేని శ్యామల, చల్లపల్లి ఏఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శివప్రసాద్‌ను సత్కరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గన్నవరం: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘ నాయకుడు మోటమర్రి నాగబ్రహ్మాచారి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చలేదన్నారు. సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయల నిధులు ఉన్నప్పటికీ పాత క్లైయిమ్‌లు చెల్లించడానికి ప్రభుత్వం ముందుకురావడం లేదన్నారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంక్షేమ బోర్డులో 1213 జీవోను రద్దు చేసి పాత క్లైయిమ్‌లు తక్షణం చెల్లించాలని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం జూలై 9న మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామన్నారు. అనంతరం సంఘ అధ్యక్షులుగా శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాస రెడ్డి, సహాయ కార్యదర్శిగా చెరువుగట్టు ప్రసాద్, నాగబ్రహ్మాచారితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న నాగబ్రహ్మాచారి తదితరులు

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో డీఎస్సీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 180 మందికి గాను 157 మంది హాజరయ్యారని, 23 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 142 మంది హాజరయ్యారని, 38 మంది ఆబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్స్‌లలో 360 మందికి గాను 299 మంది హాజరవ్వగా 61 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని తెలిపారు.



డీఎస్సీకి హాజరవుతున్న అభ్యర్థులు